


అజ్ఞానంలాంటి చీకటి దశదిశలా వ్యాపించింది.

చీకట్లో ముసుకేస్తున్న ఊరు మత్తుగా కళ్లు మూసింది. ఊరిచివర పూరిపాక ఉసూరుమంటూంది. పాకముందు చింతచెట్టు దయ్యంలా తల విరబోసుకుంది. దయ్యం తలపై సవారీచేస్తున్న దివాంధాలు గొంతులు చించుకుంటున్నాయి.

టౌనులో తొమ్మిది గంటలు కొట్టారు.

కుక్కిమంచంపై పవ్వళించిన భీముడు మెల్లిగా కళ్లు తెరిచాడు. పాకలో బుడ్డిదీపం గుడ్డిగా వెలుగుతూంది. భీముడు మెల్లిగా కళ్లు తెరిచాడు. కుక్కిమంచం కిరకిరలాడింది.

మంచం కిరకిరలకు మరదలుపిల్ల కళ్లు తెరుస్తుందేమోనని సందేహించాడు. పక్కకి తిరిగి మంగి ముఖంలోకి తొంగిచూచాడు. మంగి పెదవులమీద చిరుహాసం మెరపులా మెరిసి మాయమైంది.

'పిచ్చిపిల్ల! కలగంటూంది కాబోలు!'

భీముడు మంగి ముఖంమీదికి జీరాడే ముంగురుల్ని సర్దాడు. మరేం ఫరవాలేదనుకుని పక్కనున్న బాణాకర్ర అందుకున్నాడు. తడికె తీసి బైటపడి కిర్రుచెప్పులు తొడుక్కున్నాడు. ఒక్కసారి ఊపిరి బిగబట్టి, కండలు బిగించి. మీసం దువ్వుకుంటూ అడుగు ముందుకి వేశాడు.

పర్వతంలాంటి మనిషి భీముడు. కండలు తిరిగిన శరీరం వాడిది. జబ్బ చరిచి పొలికేక పెడితే ప్రాణాల మీద ఆశ ఉన్న వాడెవడూ పారిపోకుండా నిలవలేదు. ఆ పరిసరాల్లో వాడికి ఎదురులేదు. తలలు తియ్యడమన్నా, కసువుతో కైలాసం పంపడమన్నా నల్లేరుమీద బండినడక వాడికి. ఊళ్లో పార్టీలున్నాయి. భీముడికి పార్టీ లేదు. డబ్బిచ్చినవాడే తన పార్టీ. కూలీ తీసుకుని ఖూనీలు చెయ్యడం వాడి వృత్తి. వాడెప్పుడూ తన

వృత్తిధర్మాన్ని [illegible] డబ్బు పుచ్చుకుని వాడెవడికీ ఇంతవరకు మొండిచెయ్యి చూపలేదు. వాడికి వ్యక్తిగతంగా ఎవరిమీదా అభిమానంగానీ, ఆగ్రహం గానీ లేవు.

ప్రెసిడెంటు వెంటయ్యగారు పిల్లడాక్టర్‌పీతాంబరం మీద పగబట్టారు. పీతాంబరం పీక తెగ్గోస్తే ఐదు వందలిస్తానని కరణం కామయ్యగారి ద్వారా కబురంపాడు. పాతిక రూపాయలు అడ్వాన్సుకూడా పంపాడు. అడ్వాన్సు పుచ్చుకుని అలాగే 'అన్నాడు' భీముడు. పీతాంబరం పీక తెగ్గొయ్యడం న్యాయమో అన్యాయమో వాడికి అవసరం లేదు. న్యాయాన్యాయాలని గురించి వాడెప్పుడూ ఆలోచించలేదు. వాడికి తెలిసిందల్లా ఒకటే. మాట చెప్పి తప్పడం అన్యాయం; డబ్బు పుచ్చుకుని ఒప్పుకున్న పని చెయ్యకపోవడం అధర్మం.

మంగి పట్టి పల్లెటూరి మనిషి. న్యాయం, అన్యాయం, పాపం, పుణ్యం ఏమిటేమిటో అంటుంది. అవేమీ తన కర్మం కావు.

అయినా మంగితో వాదించడం తన కిష్టం లేదు. మంగి అంటే తనకి ప్రాణం. అందుచేత తాను చెయ్యదలచుకున్నదేదో ఆమెకు తెలీకుండా చేస్తే సరిపోతుంది.

భీముడు గబగబా నడుస్తున్నాడు.

నడివీథిలో చుట్టలు చుట్టుకుని పడుకుని ఉన్న గ్రామసింహాలు కిర్రుచెప్పుల కిరకిరలకి మేల్కొని కోపంగా చెవులు రిక్కించి, మొరగబోయి ఆరడుగుల నిండు విగ్రహాన్ని, అతని చేతిలోని బాణాకర్రని చూచి, తోకలు ముడిచి పక్కకి తప్పుకుంటున్నాయి.

నాలుగడుగులు ముందుకి నడిచేసరికి రామిగాడి కల్లుపాక ఎదురైంది. ఏదయినా అఘాయిత్యం చెయ్య దలచుకున్నప్పుడు కల్లుముంత చాలా సాయం చేస్తుంది. బోలెడు ధైర్యాన్ని, స్థైర్యాన్ని సమకూరుస్తుంది!

అలవాటు ప్రకారం పాకలోకి దూరాడు.

గుమ్మంలోనే ఎదురైంది రామిగాడి పెళ్ళాం రత్తి! అతగాణ్ణి చూచి చిన్నగా నవ్వింది.

"ఈయాలకా దొచ్చినవ్! మంగి ఇంట్లో లేదా?" అంది పమిట సర్దుకుంటూ.

భీముడికి అసహ్యం వేసింది.

రత్తి మంచిది కాదు. మంగితో పెళ్ళికాక ముందు రత్తితో తనకే సంబంధం ఉండేది. మంగిని చేసుకున్న తరవాత రత్తిని చూస్తేనే అసహ్యం వేస్తుంది. మంగిని చూచిన కళ్ళతో మరో ఆడదాన్ని చూడ్డం తన చేతకాదు.

"ఏకేం? ఉంది. ఒంట్లో అదోలా ఉంటే కాస్త మందు పుచ్చుకుందామని. . ." నసిగాడు భీముడు.

"లోపలికి రా, మరికి. అక్కడే నిల్చున్నావేం?" రత్తి ఒయ్యారం ఒలకబోస్తూ వచ్చి చెయ్యి పట్టుకుంది. "రాముడు తప్పతాగి పొయ్యికాడ తొంగున్నాడు."

భీముడికి ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకినట్టయింది.

"ఇప్పుడు కాదొదినా, మళ్ళీ వస్తాలే. కాస్త మంచి సరుకుంటే పట్రా. తొందరగా వెళ్ళాలి!"

రత్తి పట్టుకువచ్చిన మందు కాస్తా పుచ్చుకుని, ఓ చిరునవ్వు దాని ముఖాన పారేసి అక్కణ్ణించి కదిలాడు భీముడు!

ఊరు దాటుకుని, ఏటికావలనున్న పర్వతోపులోకి

**తాచుపాము తనకు అపకారం చేస్తారనుకున్నవారినే కాటువేస్తుంది. కానీ మనిషి తనకు ఉపకారం చేసిన వారినీ కాటు వేస్తాడు పాము కోరలోని విషం మనిషి ప్రాణాలు తీస్తుంది. మనిషి చేష్టలలోని విషం అతని ప్రాణాలనే తీస్తుంది**

చేరుకున్నాడు.

పిల్లడాక్టర్ ప్రతి ఆదివారం పట్నం వెళ్ళి పది దాటిం తరవాత ఆ దారంటే వస్తాడు సైకిల్‌మీద. ఏ చెట్టు చాటునో, పుట్టచాటునో నక్కి, తీరా దగ్గిరికి వచ్చిన తరవాత తన బాణాకర్రకి పని కల్పిస్తే, కుక్కిన పేనులా కిక్కురుమనకుండా చచ్చి ఊరుకుంటాడు. తన పని పూర్తి అవుతుంది! తన కూలీ తనకి వస్తుంది!

ఐదు వందలు! ఐదు వందలంటే మాటలా? ఆరు మాసాలపాటు హాయిగా బ్రతకచ్చు!

భీముడి కళ్ళు సంతోషంతో మెరిశాయి.

బాటపక్కన గుబురుగా ఓ పొదమాటున నక్కి పిల్లడాక్టర్ కోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు. చూచి చూచి అతని కళ్ళు కాయలు కాస్తున్నాయి. కాని పిల్లడాక్టర్ అయిపు లేదు.

"ఎదవసచ్చినోడు! ఎంతకీ రాడేటి?" భీముడు బూతులు తిట్టుకుంటూ అక్కడే ఉన్న ఓ చట్టుబండ మీద చతికిలబడ్డాడు.

బొడ్లోంచి చుట్టపీకా అగ్గిపెట్టె బైటికి తీసి చుట్ట వెలిగించుకున్నాడు. ఇంజన్‌లా గుప్పు గుప్పుమని పొగ వదులుతూ బాటకేసి చూస్తున్నాడు. చుట్టపీక పూర్తి అయింది. పిల్లడాక్టర్ జాడ లేదు. చుట్టపీక అవతలికి గిరాటేసి, ఖాండ్రించి తుబుక్కున ఉమ్మేశాడు. 'ఎదవనాయాలు! ఎక్కడ సచ్చిండో!' బరువుగా నిట్టూర్చాడు.

భీముడికి సహనం నశిస్తోంది. కోపంతో ఒళ్ళంతా ఉడికిపోతూంది. కళ్ళు ఎరుపెక్కాయి. మీసాలు బరువెక్కాయి. ధుమధుమలాడుతున్నాడు.

మసకచీకట్లో అల్లంత దూరాన ఏదో నీడలా కనిపించింది. భీముడు కళ్ళు చికిలించి చూచాడు. వాడివి గద్దకళ్ళు!

అవును. అది సైకిలే! ఆ సైకిల్‌మీద వస్తున్న శాల్తీ పిల్లడాక్టర్ పీతాంబరమే! సందేహం లేదు!

భీముడి ముఖం చాటంతయింది. పొదమాటున నక్కి, కర్ర చేతబట్టి అదనుకోసం ఎదురుచూస్తున్నాడు. సైకిలు క్షణక్షణానికీ దగ్గిర పడుతూంది. భీముడి శరీరంలోని నరనరం బరువెక్కిపోతూంది.రక్తం వేడెక్కిపోతూంది. మరో క్షణంలో సైకిల్ తన ముందుకి చేరుకుంటుంది. తన చేతిలోని బాణాకర్ర వాడి తల మీద బలంగా పడుతుంది. దెబ్బతో 'హరీ' అంటాడు. తన పని పూర్తి అవుతుంది.

అతడనుకున్న క్షణం రానే వచ్చింది. సైకిల్ తాననుకున్నచోటికి చేరనే చేరింది. చటుక్కున పైకి లేచి, అడుగు ముందుకి వేసి, వాటం చూసి, బలంగా

## వి. ఎస్. చెన్నూరి

కర్ర సైకెత్తాడు. తక్షణం ఏదో అతని కాలిమీద చాచి కొట్టినట్టయింది. ఉలిక్కిపడి కిందికి చూచాడు. సరసరా ప్రాకుతూంది. పైకిలేచిన కర్రపాము తలమీద పడింది. పాము మెలికలు తిరుగుతూంది. పాముతోబాటు భీముడుకూడా మెలికలు తిరుగుతూ తటాలున కింద పడ్డాడు.

సైకిలుమీద వ్యక్తి ఉలిక్కిపడి ఎగిరి కిందికి దూకాడు.

• • •

ఒళ్ళు తెలిసి భీముడు కళ్ళు తెరిచేసరికి భళ్ళున తెల్లవారింది!

పిల్లడాక్టర్ పర్ణశాలలో మరదలు పిల్ల మంగి ఒళ్ళో వెచ్చగా పడుకుని ఉన్నాడు. చుట్టూ జనం మూగి ఉన్నారు.

భీముడు కళ్ళు తెరవగానే, కంటికి కడివెడు కన్నీరు కుమ్మరించిన మంగి కళ్ళు మతాబాల్లా వెలిగాయి. "మావా" అంది దుఃఖమూ, సంతోషమూ మిళితమైన కంఠస్వరంతో.

భీముడికేమీ అర్థం కాలేదు.

"ఇప్పుడెట్టా ఉంది, మావా?" అంది మంగి ఆప్యాయంగా చెంపలు రాస్తూ.

భీముడు చివుక్కున లేచి కూర్చున్నాడు. ఒక్కసారి నలువైపులా దృష్టి సారించి "నే నిక్కడి కెట్టా వచ్చానే?" అన్నాడు విస్తుపోతూ.

"నువ్వు రావడమేంది, మావా? ఆ దర్మప్రెభువులు డాక్టరుగారు ఎత్తుకొస్తే? ఏటవతల పర్వతోపులో పాము కాటేసి పడిఉంటే డాక్టర్‌గారు తీసుకొచ్చారు. మందిచ్చి ప్రాణం పోశారు. ఆరే గనక నిన్ను సూడకపోతే నీకీ బూమ్మీద నూకలు సెల్లిపొయ్యేవి!" మంగి కళ్ళమ్మట నీళ్ళు కారసాగాయి. "ఆరు దేవుళ్ళాంటి వారు. నీకు ప్రాణం పోసి నా పసుపుకుంకం నిలబెట్టారు! ఆరికి సెయ్యెత్తి దండం పెట్టుకోవాలి, మావా!"అంది మంగి పమిటచెంగుతో కన్నీటిని తుడుచుకుంటూ.

భీముడు మాట్లాడలేదు. వాడి కంతా అయోమయంగా ఉంది!

"ఈ వేడిపాలు పుచ్చుకో, భీముడూ! కాస్త హుషారొస్తుంది!" అంటూ పాలగ్లాసు పట్టుకు వచ్చింది పీతాంబరంగారి భార్య సీతమ్మ.

భీముడు తలఎత్తి చూచాడు. సీతమ్మ కాసంత కుంకుమబొట్టుతో లక్ష్మీదేవిలా కలకలలాడుతూంది!

వాడి బుర్ర మొదటిసారిగా పనిచెయ్యసాగింది.

ఈమె నొసటి కుంకుమ తుడవాలన్న తనకు ప్రాణదానం చేసి, తన మంగి నొసటి కుంకుమని నిలిపారు. ఏమిటీ చిత్రం?

మొదటిసారిగా వాడి కళ్ళుకూడా చెమర్చాయి.

'ఛీ! ఏమిటిది? ఆడదానిలాగా?' వెంటనే తన్ను తాను సంబాళించుకున్నాడు.

ఎప్పుడూ ఎవరికీ తలవంచని తనకు తలకొట్టేసినట్టుంది.

'ఛీ! ఎదవబతుకు? అక్కడ సచ్చినా బావుండేది!' అనుకున్నాడు.

"ఊఁహూఁ. వద్దు, సీతమ్మా! నేను బాగానే ఉన్నాను!" అంటూ పైపంచ సర్దుకుని లేవబోయాడు.

"అదేమిటోయ్! కాస్త పాలు పుచ్చుకుంటే ఏం పోయింది? ఫరవాలేదు పుచ్చుకో!" అంటూ అక్కడికి

వచ్చిన పిల్లడాక్టర్ పీతాంబరం ముఖం తలపెత్తి మాట్లేకపోయాడు భీముడు.

కడుపులో దేవినట్టుంది!

ముళ్లమీద కూర్చున్నట్టుంది!

"తాగు, మావా! డాక్టర్‌బాబు చెబుతున్నారు. ఆరి మాట కాదనకు, మావా!" మంగి గ్లాసు పెదాల కందించింది.

బెబ్బులిలాంటి భీముడు పిల్లిలా మారిపోయాడు. రెండు గుక్కల్లో గ్లాసు ఖాళీచేసి "నేను ఎళ్లొస్తా బాబూ!" అంటూ చెయ్యెత్తి నమస్కరించి పైపంచ సర్దుకుని పైకి లేచాడు. తిరిగి చూడకుండా ఇంటిముఖం పట్టాడు.

వాడి మనసు మనస్సులో లేదు. ఒళ్లు స్వాధీనంలో లేదు. బుర్ర ఆలోచనలతో వేడెక్కిపోతూంది. ఎవరో తరుముతున్నట్టు పరుగు పరుగున ఇల్లు చేరుకున్నాడు. మంగి వాల్చిన కుక్కిమంచంలో ముసుగుతన్ని పడుకున్నాడు.

బుర్ర పని చేస్తూనే ఉంది. పాడు ఆలోచనలు తన బుర్రని పాడు చేస్తున్నాయి. వెధవ ఆలోచనలు తన్ను పూర్తిగా వెధవని చేస్తున్నాయి.

తాను వెధవ కాడు. ఒకడికి తల వంచని మగసిరి కలవాడు! తాను తల వంచడు! ఎప్పటికీ తల వంచడు! ఇది నిజం! ముమ్మాటికీ నిజం!

"ఇంతేనా నీ పవ?" కరణం కామయ్య వికారంగా నవ్వుతున్నాడు.

"వాడొట్టి వాజమ్మ! అనవసరంగా అద్వాన్ను దండగ చేశావు!" అంటున్నాడు ప్రెసిడెంటు పెంటయ్య.

వాడి ఒళ్లు కుతకుతలాడిపోతూంది!

పిల్లడాక్టర్ పీతాంబరం మేరుపర్వతంలా నిల్చుని ఉన్నాడు!

ఆయన ముఖం కనిపించడం లేదు!

"ఆరు దర్మప్రెబువులు!" అంటూంది మంగి.

"ఈ వేడిపాలు పుచ్చుకో. భీముడూ, కాస్త హుషారొస్తుంది!" అంటూంది సీతమ్మ.

ఆమె చేతిలో పాలగ్లాసు!

నొసట కాసంత కుంకుమబొట్టు!

"నీకు ప్రాణం పోసి నా పసుపు కుంకం నిలబెట్టారు, మావా! ఆరికి చెయ్యెత్తి దండం పెట్టుకోవాలి!" అంటూంది మంగి.

భీముడు గజగజలాడిపోయాడు. ఒళ్లు కుతకుతలాడిపోయింది.

"మంగీ!" అని గట్టిగా అరిచేశాడు.

దొడ్లోనించి పరిగెత్తుకు వచ్చింది మంగి, "మావా" అంటూ.

భీముడు ఆలోచనలలోంచి బైటపడ్డాడు. ఒళ్లు తెలిసింది.

"అబ్బే! ఏం లేదే! ఏదో కలగన్నా?" తల గోక్కుంటూ అబద్ధమాడాడు.

మంగి కేమీ అర్థం కాలేదు వాడి వాలకం.

ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కి, ఇక ఆలోచించే శక్తి లేక మొద్దుబారి, మత్తుగా నిద్ర పోయాడు భీముడు!

పొద్దు కుంకగానే గూట్లో దీపం పెట్టి, వండిన బువ్వ తలో ముద్ద తిని ఇద్దరూ పడుకున్నారు— భార్యాభర్తలు!

పడుకోగానే మంగికి నిద్ర పట్టేసింది.

భీముడికి బుర్ర పనిచేస్తూంది.

కరణం కామయ్య తనకేసి చూచి వికారంగా నవ్వుతున్నాడు.

ప్రెసిడెంటు పెంటయ్య అడ్వాన్సు దండుగయిందని చిటపటలాడుతున్నాడు.

ఇద్దరూ తనే చేతగానితనాన్ని వేలెత్తి చూపుతున్నారు. తన్ను హేళన చేస్తున్నారు.

భీముడి నరాలు బిరుసెక్కాయి. కళ్లు ఎరుపెక్కాయి. రక్తం సలసల మరిగిపోతూంది!

'అవండి! భీముడి సంగతి మీకు తెలీదు! ఎప్పుడూ ఎవరికీ తల వంచడు! చూస్తారుగా నా ప్రతాపం!' మీసం మెలిబెట్టాడు.

అమాంతం మంచంమీద నించి ఎగిరి కిందికి దూకాడు.



వలువులో నవ్వులు

ఫోటో— వి. జి. ఎస్. రెడ్డి (నెల్లూరు)

నిద్రపోయే కోడెతాచుని తట్టి లేపకూడదు!

లేచిన కోడెతాచు బుసకొట్టక మానదు!

బుసకొట్టిన కోడెతాచు కాటెయ్యక మానదు!

వళ్లు పటపటలాడిస్తూ పక్కనున్న బాణాకర్ర అందుకున్నాడు. అలవాటు ప్రకారం చటుక్కున ఆగి వెనక్కి తిరిగి మంగి ముఖంలోకి చూశాడు.

విశ్రాంతిగా నిద్రపోతూంది మంగి! నిద్రలోనే మందలిస్తూంది తన్ను!

"జరిగిన పరాభవం చాలక మళ్లీ బయలుదేరావా, మావా?" అని నిలేసి ప్రశ్నిస్తూంది.

"క్షమించు, మంగీ! ఈ ఒక్కసారి మన్నించు నన్ను! ఇక నీ మాట జవదాటితే ఒట్టు!"

వాడి మనస్సు అర్థించింది మంగిని.

గబగబా తడికె తీసి బయటపడ్డాడు. గోడవారగి కిర్రుచెప్పులు తీసి తొడుక్కున్నాడు. కండలు పొంగించి, మీసం మెలితిప్పాడు.

'ఈ భీముడు ఎవరికీ తల వంచడు! ఇది నిజం! ముమ్మాటికీ నిజం!' అడుగు ముందుకివేశాడు.

అలవాటు ప్రకారం అతడి కాళ్లు రామిగాడి పాక ముందు ఆగాయి. తడిక తోసి పకిలించాడు.

"ఎవురక్కడ?" అంటూ బైటికి వచ్చింది రత్తి.

"నేనే! భీముణ్ని! రాముడు తొంగున్నాడా?" రత్తి చెవిలో గుసగుసలాడాడు.

"నువ్వా, మరిదీ! ఎవురో అనుకున్నా. ఆడికెప్పుడో కోడి కూసింది! లోపలికి రా!" చెయ్యి పుచ్చుకుని లోపలికి లాక్కెళ్లింది. "మంగి పక్కలోకి వచ్చేసరికి మరిది పూర్తిగా మారిపోయాడనుకున్నా. ఇంకా జ్ఞాపక మున్నానా?" కైపెక్కించే కళ్లతో కవ్వించింది రత్తి.

"నిన్ను మరిచిపోతానా, వదినా? నువ్విచ్చిన ముఖం రంభకూడా ఇయ్యదనుకో!" అంటూ ఎడంచేతిని వీపుమీదికి పోనిచ్చి గిలిగింతలు పెట్టాడు.

రత్తి కిలకిలా నవ్వింది. చేతులు రెండూ వాడి భుజం మీద వేసి గట్టిగా కౌగిలించుకుంటూ "ఈ రోజు-మరిది చాలా హుషారుగా ఉన్నాడే" అంది. భీముడు రత్తి గడ్డం పట్టుకుని పైకెత్తి కళ్లల్లోకి చూచి నవ్వాడు.

"హుషారే! ఏదీ కాస్త మంచి సరుకుంటే పట్రా! అర్జంటుగా ఓ పనిమీద వెళ్లిరావాలి! అర్ధగంటలో వచ్చేస్తా!"

రత్తి సరుకు పట్టుకు వచ్చింది.

భీముడు తృప్తిగా పట్టించి, "ఇప్పుడే వస్తా!" అంటూ వెళ్లిపోయాడు. రత్తి వాడికేసే చూస్తూ నిల్చుండిపోయింది.

* * *

మామూలుగానే మళ్లీ తెల్లవారింది.

వెలుగుదేవత చీకటి రాకాసిమీదికి దండెత్తిందని తెలియగానే పల్లెప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునేందుకు తమ తమ ఇళ్లల్లోంచీ, పాకల్లోంచీ బైటపడసాగారు.

ఊరిబయట గ్రంథాలయం తాలూకు పూరిపాక పరశురామప్రీతి అయిందన్న వార్త ఊరంతా గుప్పు మంది!

పిల్లా జెల్లా, ఆడా మగా అందరూ పాలోమని పాకకేసి పరుగులు తీశారు.

కాలిన కప్పు కూలగా మొండిగోడలు బరువుగా నిట్టూరుస్తున్నాయి.

రాత్రి తిండి తిని ఇళ్లు విడిచిపెట్టిన కరణం కామయ్యగారు, ప్రెసిడెంటు పెంటయ్యగారు ఇంకా ఇళ్లు చేరుకోలేదట!

గోతులు తవ్వాలన్నా, కొంపలు ముంచాలన్నా ఆ ఇద్దరు ఊరిపెద్దలూ గ్రంథాలయం పాకలోనే సమావేశ మవుతారన్న విషయం అందరికీ తెలుసు.

ఆ పాకలో ఆ పెద్దలిద్దరూ ఏమైపోయారో వన్న బెంగకొద్దీ కొందరు యువకులు నడుములు బిగించి లోపలికి దారితీశారు. పగిలిన తలలతో, రక్తపు మడుగులో అభ్యంగనస్నానం చేస్తున్న పెద్దలిద్దర్నీ బైటికి లాగారు.

ఊరిచివర పూరిపాకలోని భీముడూ, మంగీ ఊరు విడిచి పారిపోయారన్న వార్త ఊరంతా పాక్కడానికి సూర్యుడు నడినెత్తిమీది కెక్కవలసి వచ్చింది. ★